కలసికట్టుగా కూటమి మోసాన్ని ఎండగడతాం

- ఏడాది పాలన మోసాల మయం
- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- ఎమ్మెల్సీ మురుగుడు, మంగళగిరి సమన్వయకర్త డీవీఆర్


బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మురుగుడు, డీవీఆర్ తదితరులు

మంగళగిరి టౌన్ : అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడును వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు సమన్వయంతో కలసికట్టుగా ఎండగడతామని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్)లు పిలుపునిచ్చారు. నగర పరిధిలోని 1, 2, 15, 16, 18, 20 వార్డులలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న మురుగుడు హనుమంతరావు, వేమారెడ్డిలు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనంతా మోసాల మయం, నయవంచనగా మారిందని అన్నారు. ప్రతి కార్యకర్త కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ఎండగట్టేలా వార్డు స్థాయి నుంచి సైనికుల్లా పనిచేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. నేడు అమలు చేస్తున్న అరకొర సంక్షేమ పథకాల్లో భారీగా కోతలు విధించడం దారుణమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా వార్డుల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, సీనియర్ నాయకుడు మునగాల మల్లేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాతంగి బాబు, చేనేత విభాగ రాష్ట్ర నాయకుడు గంజి షణ్ముఖ్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఊట్లపాల శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు మాదాల గోపి, మైనార్టీ అధ్యక్షుడు మాలక్‌బాబు, మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, కలకోటి స్వరూపరాణి, జిల్లా నాయకురాలు మల్లవరపు సుధారాణి, లీగల్ సెల్ అధ్యక్షుడు కలకోటి సునీల్‌కుమార్, కలకోటి బోయజ్, పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ మహబు, నాయకులు నందిగం ఆకాష్, నందిగం వసంతరావు, సందీప్, నిర్మల, కోటేశ్వరమ్మ, భీమయ్య, సయ్యద్ గౌస్, మనోహర్, సుజాత, సంజీవ కుమారి, శంకర్, సుబ్బారావు, దేవ, రాంబాబు, జొన్నాదుల గోవర్ధన్, మల్లేశ్వరరావు, సాంబయ్య, పద్మ, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


చినకాకానిలో క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త డీవీఆర్ తదితరులు

చినకాకాని(మంగళగిరి): ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ఎండగట్టడానికి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని చినకాకానిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతూ గత ఏడాదిన్నర కాలంలో ప్రజలకు బాబు చేసిన మోసాలను ఎండగట్టారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లవరపు కాంతారావు, నాయకులు కఠారి రామనాథం, దేశబోయిన చిన్న, జలసూత్రం నాగరాజు, గండికోట హేమకుమార్, కె.నరేంద్ర, ఎల్.నాగలక్ష్మి, జి.రామకృష్ణారెడ్డి, డి.కాతంరాజు, ఎం.చిన్నోడు, పి.ప్రసాద్, సీహెచ్ రమేష్, కె.నాగేశ్వరరావు, లింగినేని రామ్మోహనరావు, కట్టెపోగు భూషణం, శుభకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుగ్గిరాల: పెదపాలెం సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్ ఏర్పాటుకు 11 కేవీ పెదపాలెం ఫీడర్, 11 కేవీ పేరుకలపూడి మీదగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కె.గోపి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెదపాలెం, చినపాలెం, పేరుకలపూడి, చుక్కపల్లివారిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 1.00 గంట నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ నిలిపివేయబడునని ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా

ఎన్‌హెచ్‌ఆర్‌సీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి



తాడేపల్లిరూరల్: మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) గుంటూరు జిల్లా అధ్యక్షుడు మున్నంగి వివేకానంద రెడ్డి అన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్యామలా కోటిరెడ్డి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా మున్నంగి వివేకానందరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లోని అవినీతి, అక్రమాలను బహిర్గతం చేయడం, మానవ హక్కుల ఉల్లంఘనలను నివారించడానికి చట్టపరమైన చర్యలను అనుసరించడం తమ అజెండా అని అన్నారు. జిల్లాలో ఎవరైనా తమ హక్కులకు భంగం వాటిల్లినపుడు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తామని పేర్కొన్నారు.

నవులూరు పీడీ మాస్టర్‌కు ఎక్సలెన్స్ అవార్డు



నవులూరు(మంగళగిరి): ఇటీవల జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఐదు పాఠశాలలను స్కూలు ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు 2024–25కు ఎంపిక చేసింది. ఇందులో భాగంగా మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు ప్రభుత్వ పాఠశాల పీడీ సమ్మెట సాంబశివరావు స్కూలు ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. క్రీడా దినోత్సవం రోజు గుంటూరులోని డీఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉన్నతాధికారుల చేతుల మీదుగా సాంబశివరావు అవార్డును అందుకున్నారు. అవార్డు పొందిన సాంబశివరావును జిల్లా విద్యా శాఖ ఉన్నతాధికారులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత కంటి పరీక్షలకు విశేష స్పందన



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో సదావర్తి అన్నదానసత్రం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సదావర్తి అన్నదాన సత్రం, చినకాకానికి చెందిన ఎన్ఆర్ఐ వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి 200 మంది కంటి పరీక్షలు చేయించుకునేందుకు తరలివచ్చారు. వారికి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేసి వారిలో శుక్లాల ఆపరేషన్‌కు 85 మందిని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సత్రం ఫౌండర్ గుర్రం నాగేశ్వరరావు, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి జాతీయ ప్రతిభా పురస్కారం



ఫిరంగిపురం: మండల కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఎ.వెలంగిణీరాజు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరులో చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో సదరన్ ప్రయివేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్(ఎస్‌పీఎల్‌టీఏ) ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం వెలంగిణీరాజు నల్లపాడులోని లయోల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వెలంగిణీరాజును పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న గణపతి నవరాత్రులు


తాడేపల్లి వైఎస్సార్ సెంటర్‌లో పూజల్లో ఎమ్మెల్సీ మురుగుడు, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డీవీఆర్


వేలంలో లడ్డూను దక్కించుకున్న గోపిరెడ్డి, కుటుంబసభ్యులు


పెదవడ్లపూడి కొత్తపాలెంలో వినాయక మండపంలో మార్కెట్ యార్డు చైర్మన్ కిరణ్ చందు తదితరులు


తాడేపల్లి వైఎస్సార్ సెంటర్‌లో అన్నదానంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


టిడ్కో గృహ సముదాయంలో బుజ్జి గణపతిని వినూత్నంగా ఊరేగిస్తున్న చిన్నారులు


ఫిరంగిపురంలో నిర్వహించిన లక్ష్మీగణపతి హోమంలో భక్తులు

గణేశ్ నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. 5వ రోజు పలుచోట్ల ఉత్సవ కమిటీల ఆధ్వర్యలంలో అన్నదానాలు చేపట్టారు. లడ్డూలకు వేలం పాటలు నిర్వహించి, అనంతరం గణనాథుని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. తాడేపల్లి వైఎస్సార్ సెంటర్‌లో వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆదివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్), పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు 6 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

– తాడేపల్లిరూరల్, ఫిరంగిపురం, మంగళగిరి, మంగళగిరి టౌన్

18వ మహాసభలను జయప్రదం చేయండి



తాడేపల్లిరూరల్: సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు విశాఖపట్నంలో నిర్వహించనున్నామని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో మున్సిపల్ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరించేందుకు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. పాలకులు కార్పొరేట్లకు అనుకూలంగా ఉంటూ, కార్మిక వర్గాన్ని అణచి వేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ తరుణంలో విశాఖలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని అన్నారు. అనంతరం ఎంటీఎంసీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉండవల్లి కమిటీ అధ్యక్షుడిగా ఆవల నారాయణ, కార్యదర్శిగా మాగలూరి స్వర్ణకుమారి, మరో తొమ్మిది మందితో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సెంటర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం


వినాయకుడికి హారతి ఇస్తున్న మోదుగుల వేణుగోపాల రెడ్డి


వేలంలో లడ్డూ పాడుకున్న శ్రీనివాసరెడ్డికి లడ్డూను అందజేస్తున్న కమిటీ సభ్యులు

- భారీ ధర పలికిన లడ్డూ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మోదుగుల వేణుగోపాల రెడ్డి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు)లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య ఆదివారం వినాయక నిమజ్జన గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ గుంటూరు, పల్నాడు, ఎన్‌టీఆర్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా వైఎస్సార్ సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనానికి హారతి ఇచ్చారు. తాడేపల్లి పట్టణానికి చెందిన బుర్రముక్కు హరికృష్ణా రెడ్డి (లేటు) మనుమరాలు బుర్రముక్కు యతిరాజవల్లి ఇచ్చిన 37 కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా తాడేపల్లి పట్టణానికి చెందిన శ్రీరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, వెంకట రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు రూ.6,05,000కు దక్కించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు మోదుగుల వేణుగోపాలరెడ్డిని, విగ్రహ దాత కళ్ళం రాజశేఖరరెడ్డిని, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని, ఇతర దాతలను ఘనంగా సత్కరించారు. అనంతరం వీరభద్ర నాట్యం, దాండియా, కోలాటం, బాణసంచా మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళ్ళం రాజశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గాంధీ, సాంబిరెడ్డి, రుక్మాంగరెడ్డి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి


మాట్లాడుతున్న కిరణ్

మంగళగిరి టౌన్: నగర పరిధిలో ఉన్న చింతక్రింది కనకయ్య (సీకే) విద్యా సంస్థలు, వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఉన్న నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాజధాని ప్రాంతంలోని పేద విద్యార్థులు లక్షలాది రూపాయలు పోసి చదువుకొనాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటి ప్రైవేటు యూనివర్శిటీలలో రాజధాని ప్రాంత విద్యార్థులకు 20 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా అబ్దుల్ గని, పఠాన్ మున్నా, ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ ఇర్ఫాన్, సహాయ కార్యదర్శిగా సమీర్‌లను ఎన్నుకున్నారు. రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా ఈ కమిటీ పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు.

నిడమర్రులో చోరీ

నిడమర్రు(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రులో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కురంగేశ్వరరావు కుటుంబసభ్యులతో సహా ఆగస్టు 24వ తేదీన తిరుపతి వెళ్లారు. 26వ తేదీ తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.4 లక్షల విలువైన 30 గ్రాముల బంగారం, పలు వెండి వస్తువులు, రూ.45 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు శనివారం రాత్రి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన దుండగులు చుట్టు పక్కల వారు కేకలు వేయడంతో తమ ద్విచక్ర వాహనం వదిలి పారిపోయారని, వాహనం నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గృహాల నిర్మాణాల కొలతలు ఆన్‌లైన్‌లో సచివాలయ సిబ్బంది పొందు పరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వామిత్వలో భాగంగా సచివాలయ సిబ్బంది కొండమెట్ల బజార్, బీఎస్ఎన్ఎల్ బజార్, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కొలతలు, యజమాని ఆధార్, హద్దులు, ఫోన్‌నెంబర్, దస్తావేజులు పరిశీలించి వాటిని ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. దీనిద్వారా యజమానికి సంబంధించిన పూర్తివివరాలు ఆన్‌లైన్ చేసి గృహ యాజమాన్య కార్డు అందజేస్తారని చెప్పారు. గృహాన్ని అమ్ముకోవాలన్నా, బ్యాంకులో రుణం తీసుకోవాలన్నా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ డీపీ వై.సుమంత్‌మోహన్, వెల్ఫేర్ కె.కల్పన, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాషింగ్ ప్లాట్‌ఫామ్‌కు శంకుస్థాపన


భూమి పూజలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్, సభ్యులు

దుగ్గిరాల: చేతిపంపుల స్థానంలో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణం కోసం భూమి పూజ చేయడం జరిగిందని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ అన్నారు. ఆదివారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న చేతి పంపుల స్థానంలో నూతనంగా రూ.1.60 లక్షల వ్యయంతో వాషింగ్ ప్లాట్‌ఫామ్ నిర్మిస్తున్నామని, దీంతో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.శోభాదేవి, దోస్త్ కమిటీ సభ్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యవర్గ సభ్యులు, గూడూరు వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోరంపూడి గ్రైటనాల్టెస్‌కి పరుపులు అందజేత

గ్రైటనాల్టెస్ డైరెక్టర్ వంగర హేమ చందు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోరంపూడిలో ఉన్న గ్రైటనాల్టెస్ లెప్రసీ ఆసుపత్రికి రోగుల అవసరాల నిమిత్తం పరుపులు, దిండ్లను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, సిబ్బంది ఆదివారం అందించారు.

మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి


కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: ఐటీ, విద్యా శాఖల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు యూనియన్ నాయకులతో కలసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 కుటుంబాలతో ముడిపడి ఉన్న సమస్యను పరిష్కరించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ఎన్నికల ముందు నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కూరపాటి స్టీవెన్, ఎం.ఆశీర్వాదం, సుభాని, సూర్యప్రకాష్, సుబ్బారావు, కార్మికులు బాషా, విజయశ్రీ, నవనీతం, శారద, దుర్గాభవాని, కనకదుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాల సంకలన పుస్తకాలతో ఆధ్యాత్మిక చింతన



మంగళగిరి: గ్రంథాల సంకలన పుస్తకాలతో ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని ఇలాంటి గ్రంథాలను ఇప్పటికీ కొందరు రచించడం అభినందనీయమని రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ బలుసు శివ శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ వాసిరెడ్డి వేంకటరామయ్య కళావేదికలో ఆదివారం రాత్రి నల్లూరి రామచంద్రభట్టాచార్యులు రచించిన భగవదుత్స వానుక్రమణికా గ్రంథాన్ని వీవీఐటీ విశ్వవిద్యాలయం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆరుణప్రియ దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హిందూ కళాశాల మాజీ ప్రధాన ఆచార్యులు దీవి నరసింహదీక్షితులు, రాష్ట్ర అర్చక ట్రెనింగ్ అకాడమీ పూర్వ సంచాలకులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.